

# ‘ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్యరంగం - తీరు తెన్నులూ - పరిణామాలు’

## రాష్ట్ర స్థాయి సదస్సు

## ఆహ్వానం

### 5 ఏప్రిల్, 2026, MBVK, విజయవాడలో

మిత్రులారా!

ప్రజల ఆరోగ్యానికి బాధ్యత ఎవరిది? నాణ్యమైన, మానవీయమైన, శాస్త్రీయమైన వైద్యం ప్రజలందరికీ అందుబాటులోకి తేవడం అవసరం కాదా? విపరీతంగా పెరిగిపోతున్న ఆసుపత్రుల ఖర్చుల నుండి ఎవరు రక్షించాలి? - ఇటువంటి ప్రశ్నలు ముఖ్యమైన ప్రశ్నలుగా భావించే మిత్రులందరికీ జన విజ్ఞాన వేదిక నిర్వహించే రాష్ట్ర ఆరోగ్య సదస్సుకు ఆహ్వానం చెబుతున్నాము. ఈ సదస్సులో ప్రజారోగ్య నిపుణులు, సామాజిక కార్యకర్తలు, ఆరోగ్యరంగ కార్యకర్తలు, డాక్టర్లు పాల్గొంటారు.

మనం అనేక వార్తలు వింటున్నాం. మునిసిపాలిటి పైపుల ద్వారా సరఫరా అయ్యే తాగేనీటిలో మానవ మలమూత్రాలు కలగలసి కలుషితం కావడంవల్ల డయేరియాతో / అతిసారతో మనుషులు చనిపోవడం చూస్తున్నాం. గిరిజన ప్రాంతాలలో వేలాదిమంది జ్వరాల పాలవుతున్నా కనీస వైద్యం అందని పరిస్థితి ఉంది. సిగ్గుచేటయిన ఈ పరిస్థితి నుండి ప్రభుత్వాలు, సమాజాలు బయట పడలేవా?

మరోవైపున జీవనశైలి జబ్బులు చూస్తున్నాం. పదిమంది ఒకచోటున కలిస్తే, అందులో అయిదారుగురికి గుండె జబ్బు, బి.పి., షుగర్లు, స్థూలకాయం ఉంటున్నా ఆశ్చర్యపోనక్కర్లేని పరిస్థితి. వీటి వైద్యానికై కుటుంబాలు ప్రతి నెలా వేల రూపాయలు ఖర్చు పెట్టాల్సివస్తోంది. పేదలు, దిగువ మధ్యతరగతి వారికే కాదు సాధారణ మధ్యతరగతి ప్రజలకు కూడా వైద్యం భారంగా తయారవుతున్నది. ఎందుకిలా అవుతున్నది?

మిత్రులారా! ఈ పరిణామాలకు పరిష్కారాలు లేవా? అంటే ఉన్నాయనే ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతున్నది. ప్రజలందరి ఆరోగ్య పరిరక్షణకు బాధ్యత ప్రభుత్వాలదే. పౌరులు వ్యక్తిగతంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలు ఉంటాయి. పాటిస్తుంటారు కూడా. కాని ప్రజలందరి ఆరోగ్యాన్ని కాపాడటానికి అవసరమైన వ్యవస్థలను నిర్మించడం, నిర్వహించడం, దీర్ఘకాలిక ప్రణాళికలు, పాలసీలను చేయడం ప్రభుత్వాలు మాత్రమే చేయాల్సిన పని. ఈ రోజున ఆ పని నుండి ప్రభుత్వాలు తప్పించుకొంటున్నాయి.

ఇందుకు ఒక ఉదాహరణ చూద్దాం. WHO ప్రకారం ప్రజల ఆరోగ్యం కోసం GDPలో 5% ప్రభుత్వాలు ఖర్చు పెట్టాలి. 2017 నేషనల్ హెల్త్ పాలసీ ప్రకారం చూసినా అది GDPలో 2.5% ఉండాలి. కాని ఈసారి కేంద్ర బడ్జెట్లో ఆరోగ్యానికి కేటాయించింది కేవలం 1.15%. అట్లే రాష్ట్ర బడ్జెట్‌లో 8% పైగా కేటాయించాల్సి ఉండగా కేటాయించింది 5.2% మాత్రమే. తగినంతగా ఖర్చు పెట్టడానికి సిద్ధం కాకపోతే వ్యవస్థలు ఎలా పనిచేస్తాయి? అవసరమైన దానికంటే సగం ఖర్చు పెడితే ఏవిధంగా ఫలితాలు వస్తాయి?














రాజ్యాంగం ప్రకారం ఆరోగ్యం రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతే. ఆరోగ్యం అంటే ఏవో కొన్ని పథకాలకు రూపకల్పన చేయడం కాదు. మన రాష్ట్ర ప్రభుత్వం సంజీవని, ఇన్సురెన్సు, PPP, డిజిటల్ హెల్త్ – లాంటి పథకాలనే విధానాలుగా భావిస్తున్నట్టు ఉంది. నిజానికి ఇవన్నీ వైద్య రంగాన్ని మరింత ప్రైవేటీకరణకు, కార్పొరేటీకరణకు, ఇన్సురెన్సీకరణకు గురిచేస్తాయి. ప్రజలకు వైద్యం అందుబాటులో లేకుండా చేస్తాయి. అందుకే ప్రజలందరికీ ఆరోగ్యం కావాలని కోరుకొనే వారు సమగ్ర ఆరోగ్య విధానాల కోసం, బలమైన ప్రభుత్వ ఆసుపత్రుల కోసం డిమాండ్ చేయాల్సి ఉంది. అట్లే ప్రపంచ ఆరోగ్య సంస్థ చెప్పిన కాంప్రహెన్సివ్ ప్రైమరీ హెల్త్ కేర్, యూనివర్సల్ హెల్త్ కేర్ లాంటి మౌలిక విధానాల గురించిన విస్తృతమైన చర్చ జరగాల్సిన అవసరం ఉంది.

ఈ రోజు రాష్ట్రంలో పరిస్థితులు చూద్దాం. వైద్యరంగం అంతా ప్రైవేట్ శక్తుల గుప్పిట్లో ఉంది. వైద్యం ఖర్చులతో మధ్యతరగతి కూడా అప్పుల ఊబిలోకి దిగజారుతున్నది. ప్రభుత్వాసుపత్రులను PPP పేరుతో ప్రైవేటు శక్తుల చేతుల్లో పెడుతున్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, జిల్లా కేంద్ర ఆసుపత్రులు అరకొర నిధులతో, చాలీచాలని మందులతో నడుస్తున్నాయి. పట్టణ ప్రాంతాలలో ఉండే కమ్యూనిటి హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులలో స్పెషలిస్టుల సేవలు నామమాత్రమవుతున్నాయి. ఇక పి. హెచ్.సి.లను పట్టించుకొనేవారే లేరు. పరిస్థితులు ఇలా ఉన్నా మంచి వైద్యులు, సిబ్బంది ఉన్నచోట, జవాబుదారీతనం ఉన్నచోట ప్రజలు కిక్కిరిసి ప్రభుత్వాసుపత్రులకు వస్తున్నారు. ఇప్పటికీ పేద ప్రజలకు ప్రభుత్వాసుపత్రులే దిక్కవుతున్నాయి. కాని వాటిని మెరుగు చేయడానికి ఏమిచేయాలనే ఒక దీర్ఘకాలిక ప్రణాళిక రాష్ట్ర ప్రభుత్వం దగ్గర లేదు. ఏదో ఒకవిధంగా ప్రైవేటీకరణ చేసి, చేతులు దులుపుకొందామనే ధోరణి ప్రభుత్వాలది! ఆరోగ్యశ్రీని కూడా హైబ్రిడ్ పేరుతో ప్రైవేటు ఇన్సురెన్సుకు అప్పగించే ప్రయత్నం జరుగుతోంది. ఇక ఆలోచించుకోవాల్సింది ప్రజలే!

ఈ నేపథ్యంలో జరుగుతున్న రాష్ట్ర ఆరోగ్య సదస్సుకు ఆరోగ్యరంగంలో పనిచేస్తున్న సంఘాల ప్రతినిధులను, సభ్యులను, వివిధ ప్రజా సంఘాలనూ సాదరంగా ఆహ్వానిస్తున్నాము. ఈ రంగంలో ఆసక్తి ఉన్న పౌరులకూ స్వాగతం. అందరూ ప్రత్యేక శ్రద్ధతో ఈ సదస్సును విజయవంతం చేయాలని కోరుతున్నాము.



**ఆహ్వానించువారు**

**జనవిజ్ఞాన వేదిక, ఆంధ్రప్రదేశ్** (Affliated to AIPSN)

**ప్రజా ఆరోగ్య వేదిక, ఆంధ్రప్రదేశ్**

**ప్రజారోగ్య పరిరక్షణ కమిటి**

**యునైటెడ్ మెడికల్ & హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్**

**యునైటెడ్ విలేజ్ సెక్రెటరీస్ అసోసియేషన్**

**జాయింట్ యాక్షన్ కమిటి ఆఫ్ నేషనల్ హెల్త్ మిషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్**